

మహిళా ప్రీమియర్ లీగ్‌కు ఎన్.శ్రీచరణి ఎంపిక



ప్రజాశక్తి - కడప

మహిళా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) ఆక్షన్‌లో కడపకు చెందిన క్రికెట్ క్రీడాకారిణి ఎన్. శ్రీ చరణి రూ. 55 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ టీముకు ఎంపికైంది. ఆమె ఉమెన్ ప్రీమియం లీగ్‌కు ఎంపిక కావడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్య దర్శి ఎ. రెడ్డిప్రసాద్, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ చరణికి అభినందన శుభా కాంక్షలు తెలియజేశారు.

ప్రమాదంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం

- వ్యవస్థల వైఫల్యంతోనే 'సాయిబాబా' మృతి
- ఇష్టానుసారంగా ఉపా, రాజద్రోహం కేసులు
- 'చట్టం అందరికీ సమానమేనా' సదస్సులో విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దేశం ఫాసిజానికి దగ్గరవుతోందని, అభ్యుదయవాదులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ విశ్రాంత అధ్యాపకులు, పౌరహక్కుల వేత్త హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కడప నగరంలోని హరిత్ హోటల్‌లో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది బొగ్గుల గుర్రప్ప అధ్యక్షతన నిర్వహించిన 'ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా స్మృతి..చట్టం అందరికీ సమానమేనా ' అంశంపై ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయన్నారు. రాజ్య స్వభావం మారేకొద్దీ పోరాటాలు పెరుగుతాయనే సంగతిని గుర్తించుకోవాలన్నారు. నిరాధారమైన ఆరోపణలతో ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాను పదేళ్లపాటు జైలులో పెట్టి, ఆయన విలువైన సమయాన్ని బలి తీసుకున్నారని విమర్శించారు. విశ్వవిద్యాలయ, న్యాయ వ్యవస్థ, జైలు వ్యవస్థల వైఫల్యం కారణంగా జి.ఎన్ మృతి చెందారన్నారు. తెలంగాణాలోని ములుగు కేసులో నిరాధార మైన ఆరోపణలతో 150 పేర్లు చేర్చారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే తనతో సహా ఆరుగురు న్యాయవాదులను తొలగించి, మిగిలిన వారిని కేసులో ఉంచారన్నారు. వీరిలో బాంబే హైకోర్టు జడ్జి సురేష్ పేరును మూడు చోట్ల చేర్చారని, అప్పటికే ఆయన చనిపోయార వాపోయారు. ప్రొఫెసర్ జిఎన్‌ను విడుదల కావడం, మరుసటి రోజు అరెస్టు చేయడం, అర్ణబ్‌గోస్వామి ఉదయం అరెస్టు, సాయంత్రం బెయిల్ ఇవ్వడాన్ని చూస్తే దేశంలో చట్టం అందరికీ సమానమే ఎలా అవుతుందో ఆలోచించుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని పాలకులే బద్దలు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎన్ శారీరక వైకల్యంతోపాటు, సామాజిక రుగ్మతలపైన చివరి శ్వాస వరకు అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కంకణం కట్టుకోవాలని చెప్పారు. అర్బన్‌నక్సల్స్ పేర్ల జాబితాలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేర్చడం పాలకుల వైఖరి తేటతెల్లమైందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో మణిపూర్‌కు చెందిన ఎనిమిది మంది బిజెపి కుకీ ఎమ్మెల్యేలు నిరసన ర్యాలీ నిర్వహించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. ప్రొఫెసర్ జిఎన్‌కు రెండు సార్లు బెయిల్ వచ్చినప్పటికీ, వెంటనే అరెస్టు చేయడం దేనికి సంకేతమో ఆలోచించాలని సూచించారు. 1891 నుంచి 1947 వరకు 124 (ఎ) సెక్షన్ కింద బ్రిటిష్ ప్రభుత్వం 347 రాజద్రోహం కేసులు నమోదు చేయగా, మోడీ పదేళ్ల పాలనలో 548 మందిపై రాజద్రోహం కేసులు నమోదు చేసిన ఘనత ఆయనకే దక్కిందని పేర్కొన్నారు. హత్రాస్ ఘటన కవరేజికి వెళ్లిన సిద్ధిఖ్‌కప్పన్ జర్నలిస్టును 712 రోజులు జైలులో నిర్భందించారన్నారు. అంతకు ముందు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రవి ప్రసంగించారు. చివరగా పిహెచ్‌డి స్కాలర్ మల్లెల భాస్కర్ వందన సమర్పణ చేశా రు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ నాయకులు కుళాయిస్వామిరెడ్డి, ప్రముఖ వైద్య నిపు ణులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగల్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు ఎల్ఐసి యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులరెడ్డి, వందలాది మంది మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్

కడప ఉక్కుపై కపట నాటకం

- ఫిబ్రవరి నుంచి ఉక్కుపై ఉద్యమం
- టిడిపి, జనసేన వైఖరిని స్పష్టం చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయలసీమ డిక్లరేషన్ పేరుతో నాటకాలాడిన బిజెపి రాయ లసీమ ద్రోహిగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాం భూపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ అమలు విషయంలో సెయిల్, నాణ్యత పేర్లతో కపట నాటకం ఆడుతోందన్నారు. కేంద్రబడ్జెట్‌లోనూ ఎటువంటి కేటాయింపులు చేయ కుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం టిడిపి మద్దతుతోనే కొనసాగుతోందని, ఇటువంటి సమయంలో టిడిపి, జనసేన పార్టీలు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ పట్ల స్పష్టత రాబట్టుకోవాలన్నారు. ఇటీవల కేంద్రమంత్రి కుమారస్వామి పరిశీలనలో లేదని చెబితే ఎటువంటి నిరసన వ్యక్తం చేయని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయో చెప్పాల్సి ఉందన్నారు. రాష్ట్రం లోని పరిస్థితులను ఆసరా చేసుకుని కేంద్రం ఇష్టానుసారంగా వ్యవ హరిస్తోందని విమర్శించారు. గత ఎన్డీయే ప్రభుత్వంతో టిడిపికి బంధం తెగగానే చెరో వైఖరితో సీమను మోసం చేశాయన్నారు. బిజెపి నాణ్యత, ఫీజుబిలిటీ పేరుతో, టిడిపి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్‌ను నిరాహారదీక్షకు పురమాయించి నాటకాలు ఆడాయన్నారు. ప్రస్తుతం ఎంపీ సిఎం రమేష్ బిజెపిలో ఉంటూ ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. వలసలు, రోడ్డుప్రమాదాలు, వ్యవసాయ కూలీలు, కరువు కాటకాలతో దేశంలోనే వెనుక ప్రాంతమైన రాయల సీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయ డానికి 14 ఏళ్లు తీసుకుంటాయా అంటూ ఉద్వేగంతో ప్రసంగి ంచారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై టిడిపి, జనసేన స్పష్టమైన వైఖ రులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో కడప ఉక్కు ఉద్యమంపై స్పష్టత ఇస్తామని తెలిపారు. ప్రతిపక్ష స్థానంలో ఉన్న వైసిపి నిబద్ధ తతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. కాంక్రీట్‌గా వ్యవహరి ంచాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, రామ్మోహన్, మనోహర్, అన్వేష్, కామనూరు శ్రీనివా సులరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

పొట్టి శ్రీరాములు త్యాగం ఆదర్శనీయం

- డిఆర్‌ఒ విశ్వేశర్‌నాయుడు

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని డిఆర్‌ఒ విశ్వేశ్వర్ నాయుడు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సంస్మరణ సభ డిఆర్‌ఒ అధ్యక్షతన నిర్వహించారు. డిఆర్‌ఒతోపాటు కలెక్టర్ ఎఒ విజయ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం వరుసగా 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, చివరికి డిసెంబర్ 15న ప్రాణాలర్పించిన మహనీయులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ ఆదర్శనీయం అని కొనియాడారు. దేశంలోని భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అశేష స్ఫూర్తిగా నిలిచిన ఆయన మన తెలుగువారని చెప్పుకోవడం గర్వకారణం అన్నారు. అంతటి మహోన్నతమైన స్వాతంత్ర్య సమరయోధులు, అమరజీవి పొట్టిశ్రీరాముల త్యాగాన్ని ఈ రోజు తెలుగువారందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 25వ సంవత్సరంలో పొట్టి శ్రీరాములు భార్య చనిపోవడంతో జీవితంపై విరక్తి కలిగి తన ఆస్తి మొత్తం అన్నదమ్ములకు ఇచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహాత్యాగి అన్నారు.1 930 సంవత్సరంలో సత్యాగ్రహంలో పాల్గొని ఆయన జైలు జీవితాన్ని కూడా అనుభవించారన్నారు. దేశంలో కుల వివక్షత అధికంగా ఉన్న ఆ రోజుల్లో ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యమం సామాన్యంగా మొదలై తీవ్రరూపం దాల్చి ప్రజలలో అలజడి రేపిందన్నారు. అప్పటికే నిరాహార దీక్ష చేస్తున్న పొట్టి శ్రీరాములు 1952 డిసెంబర్ 15న అర్ధరాత్రి తన ఆశయ సాధనకు ప్రాణాలర్పించి అమరజీవి అయ్యాడన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గంలో పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర జీవి త్యాగాన్ని ఈ తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముందుగా గౌరవ అధ్యక్షులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు అమరజీవి త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో కాలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు, సంక్షేమ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ

వైసిపికి బిగ్‌షాక్!

- టిడిపిలోకి ఏడుగురు కార్పొరేటర్లు
- ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డితో చర్చలు విఫలం
- నేడు చంద్రబాబు సమక్షంలో చేరిక?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపికి బిగ్‌షాక్ తగలనుంది. కడప కార్పొరేషన్‌కు చెందిన ఏడుగురు వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరనున్నారు. ఈమేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కార్పొరేటర్లతో జరిపిన చర్చలు విఫ లమైనట్లు తెలిసింది. ఈనేపథ్యంలో కడప నగరం తూర్పు, ఉత్తర ప్రాంతానికి చెందిన ఏడుగురు పెత్తందారి సామాజికవర్గానికి చెందిన కార్పొరేటర్లు సోమవారం విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే శంకరాపురం ప్రాంతానికి చెందిన ఒక కార్పొరేటరు టిడిపిలో చేరిన సంగతి తెలిసిందే. ఈలెక్కన టిడిపిలోకి వెళ్లిన కార్పొరేటర్ల సంఖ్య ఎనిమిదికి చేరినట్లు తెలుస్తోంది.రాబోయే రోజుల్లో జంప్‌జిలానీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

శిక్షణలు వాయిదా వేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

సమ్మిటివ్ పరీక్షల సమయంలో ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ తరగతులు నిర్వహించడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్ పాలెం మహేష్ బాబు తెలిపారు. యుటియఫ్ భవన్‌లో టీచర్ ఎమ్మెల్సీ షేక్. సాబ్జి వర్ధంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి యుటిఎఫ్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఈనెల 11 నుంచి 19 వరకు సమ్మిటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించడం సరికాదని వారన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలు చాలా ఎక్కువగా ఉన్నాయని, ఇలాంటి తరుణంలో ఉపాధ్యాయులను శిక్షణా తరగతులలో నిమగ్నం చేస్తే పాఠశాలల్లో పిల్లలకు పరీక్షలు ఎవరు నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు. పరీక్ష పూర్తయిన రెండు రోజుల్లో పేపర్లు దిద్ది ఆన్‌లైన్‌లో మార్కులు కూడా నమోదు చేయాలని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధమైన నిర్ణయాలను కూడా వారు తప్పు పట్టారు. పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత అనే పేరుతో ఇటీవల రాష్ట్ర ఎస్‌సిఇఆర్‌టి అధికారులు విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉపాధ్యాయులను సెలవు రోజుల్లో కూడా పాఠశాలలకు రమ్మనడం సరికాదన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ అసంబద్ధ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో శిక్షణ తరగతులను బహిష్కరిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై. రవికుమార్, డి.సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎ.శ్రీనివాసులు, ఏజాస్ అహమ్మద్,ఈరి బాలజోజి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్ రెడ్డి, రూతు ఆరోగ్యమేరి, కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు ఈశ్వర రావు, శంకర్ రెడ్డి, అనిల్ కుమార్, రామచంద్రయ్య, అశ్వక్ పాల్గొన్నారు.



షేక్. షాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నేడు 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కడప : భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సోమవారం 22 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లోని అట్లూరు మండలం అట్లూరు, బి.కోడూరు మండలం వెంకటాపురం, బి.మఠం మండలం సోమిరెడ్డి పల్లి, బద్వేల్ మండలం రాజుపాలెం, గోపవరం మండలం మడకలవారి పల్లి, కలసపాడు మండలం సంకవరం, మైదుకురు మండలం ఎన్. మైదుకూరు, పోరుమామిళ్లఎల్లోపల్లి, పులివెందుల రెవిన్యూ డివిజన్ లోని పులివెందుల మండలం చిన్న రంగాపురం (1120010), వివిన్ పల్లి మండలం కొమ్మద్ది, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ లోని రాజుపాలెం మండలం టంగటూరు, మైలవరం మండలం దన్నవాడ (1102014), కొండాపురం మండలం ఎర్రగుడి, జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ల పల్లి గ్రామాల్లో నిర్వహించనున్నారు. ఇంకా కడప రెవెన్యూ డివిజన్ లోని పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు, వల్లూరు మండలం కుమారుని పల్లి, కడప మండలం పాలెంపల్లి, ఖాజీపేట మండలం పాటూరు, ఒంటిమిట్ట మండలం గంగపేరూరు, సికె దిన్నె మండలం చిన్నకాంపల్లె, కమలాపురం మండలం గంగవరం, విభరాపురం గ్రామాల్లో సదస్సు నిర్వహిస్తారు.

145 జీవోను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - కడప : జీవో నంబర్ 145ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్. వి. రమణకు కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు మెమోరాండంను అందజేశారు. మాజీ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ఎన్. వి. రమణ సానుకూలంగా స్పందించారు. మెమోరాండం సమర్పించిన వారిలో సీనియర్ న్యాయవాదులు పి. జయరామిరెడ్డి, ఎ. వెంకటరమణ, న్యాయ విద్యార్థి ఎన్. రామాంజనేయులు ఉన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని సుందరయ్య కాలనీలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వ హించారు. వైద్య శిబిరాన్ని సుందరయ్య కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఎస్‌విఎస్ఎస్ సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వ్యవస్థాపకులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుమన్, షుగర్ వ్యాధి వైద్య నిపుణురాలు వై. వైవి సరస్వతి, గర్భసంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ పవిత్ర, ఎముకలకు సంబంధించి ఆర్థోపెడిక్ డాక్టర్ అరుణ్జిత్, షాజీ డాక్టర్ వీరనాద్‌రెడ్డి దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ఐ సుందరయ్య కాలనీలో 2వేల కుటుంబాలు పేదలు నివాసం ఉంటున్నారని, వీరందరూ నిరుపేదలని ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోవాలంటే వేల రూపాయలు వ్యయం చేయలేని పరిస్థితి అన్నారు. వారి ఇబ్బందులను చూసి డివైఎఫ్ఐ యువజన సంఘం సంజీవిని హాస్పిటల్ డాక్టర్ కోటా సుమన్‌ను సంప్రదించగా ఆయన స్పందించి సుందరయ్య కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి పేదలకు ఉచితంగా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని పరీక్షలు చేసి మం దులు అందజేశారన్నారు. వారి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. డివైఎఫ్ఐ యువజన సంఘం నిరుద్యోగ యువతీ యువకుల సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. ఎవరైనా నిరుపేదలు ఉంటే సంజీవిని ఆస్పత్రిలో ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ తరపున ఒక్క రూపాయి ఖర్చు కాకుండా వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్, రూరల్ కార్యదర్శి యు బాల గురయ్యా, పట్టణ మహిళా కో - కన్వీనర్లు ఫాతిమా, సాయిలక్ష్మి పట్టణ ఉపాధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాలువలో పడి యుసిఐఎల్ ఉద్యోగి గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యురేనియం కర్మాగారంలో పనిచేస్తున్న పాలగిరి రామాంజనేయులు కాలువలో పడి గల్లంతు కావడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. నల్లపురెడ్డిపల్లి రహదారి సమీపంలో ఉన్న కాలువ గట్టున మోటార్ బైకు, చెప్పులు ఉన్నాయి. కానీ రామాంజనేయులు కన్పించలేదు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారాన్ని ఇచ్చారు. కాలువలో పడి గల్లంతు అయి ఉండవచ్చునని, పోలీస్, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాలిస్తున్నారు. కాగా రామాంజనేయులు యుసిఐఎల్‌లో ఎఎండి ఆపరేటర్‌గా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. అతని స్వగ్రామం వేముల మండలం మబ్బు చింతలపల్లి. ప్రస్తుతం పట్టణంలోని ఎరగుడిపల్లెలోనివాసముంటున్నారు. కాలువలో పడి గల్లంతయ్యారా, లేదా ఎవరైనా నీటిలో తోసేసింటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పంట కాల్వలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం!

- కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి
- డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.నాగరాజు

ముఖాముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మారిన జీవనశైలి, పర్యావరణ పరిశుభ్రత, పోషకాహార లోపంతోనే ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. జీవన వ్యయంలో సగానికిపైగా ప్రజారోగ్యానికే వ్యయం అవుతున్న పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. అంటువ్యాధులు ప్రబలక మునుపే ప్రజానీకం వ్యాధులకు గల మూల కారణాలను గుర్తించిన తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలి. వ్యాధులు సోకిన తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా, అవగాహనే అద్భుతమైన ఔషదమని గుర్తించాలి. లేనిపక్షంలో వ్యాధుల బారిన పడి తీవ్రమైన ఆర్థిక, కష్ట నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న ఆరోగ్య సమస్యలను సమర్థంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.నాగరాజు వెల్లడించారు.



జిల్లాలోని వైద్యుల కొరత ఏమైనా ఉందా?

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యుల కొరత లేదు. 51 ప్రభుత్వ ఆస్పత్రులకు ఇద్దరు చొప్పున 102 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో రెండు పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి.

జిల్లాలోని పిహెచ్‌సిలు, డయాగ్నోస్టిక్ కేంద్రాలెన్ని?

జిల్లాలో 51 పిహెచ్‌సిలు, 30 యుపిఎస్‌ఇలున్నాయి. కడపలో 13, ప్రొద్దుటూరులో 05, బద్వేల్‌లో 03, పులివెందులలో రెండు, జమ్మలమడుగులో రెండు చొప్పున ఉన్నాయి. వీటితోపాటు 384 విలేజ్ హెల్త్‌క్లినిక్స్‌లు, బిఎస్‌ఇ నర్సింగ్ హోమ్స్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు 14 స్కానింగ్ కేంద్రాలు ప్రయివేటులో సుమారు 401 ఆస్పత్రుల్లో 168 స్కా నింగ్ కేంద్రాలు ఉన్నాయి.

కేన్సర్‌స్క్రీనింగ్ ఎలా సాగుతోంది?

జిల్లాలో నవంబర్ 19 నుంచి 18 ఏళ్లు పైబడిన మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇందులో హైపర్ టెన్షన్, డయాబెటిక్, కేన్సర్, ఎన్‌సిడి 3వ దశలో హైపర్‌టెన్షన్, డయాబెటిక్, హెచ్‌బి, ఓరల్ కేన్సర్, బ్రెస్ట్‌కేన్సర్, 13వ సర్వైకల్ కేన్సర్ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది.

24.7 సేవల తీరుతెన్నులపై మాట్లాడండి?

జిల్లాలోని 51 పిహెచ్‌సిల్లో 24.7 సేవలు కొనసాగుతున్నాయి. ఒక్కో పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లతో సాగుతోంది.

మహిళా ఆరోగ్యానికి తీసుకున్న చర్యలేమిటి?

జిల్లాలో మహిళల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాం. ప్రతినెలా ఫ్యామిలీ కాన్సెప్ట్ చికిత్సలు, పిఎంఎస్‌ఎ పథకం కింద ప్రతినెలా తొమ్మిదో తేదీన హైరిస్క్ గర్భిణులను పిహెచ్‌సిలకు పిలిపించుకుని పరీక్షిస్తారు. గైనకాలజిస్టు పర్యవేక్షణలో వైద్యపరీక్షలు చేయడం, స్పాన్సర్స్, ఉదార స్వభావం కలిగిన వైద్యుల సహకారంతో పోషకాహారాన్ని అందించే ప్రయత్నం సాగుతోంది.

జిల్లాలో జ్వరాల తీవ్రతపై స్పందించండి?

జిల్లాలో జ్వరాలు తక్కువగానే ఉన్నాయి.187 డెంగ్యూ, 13 మలేరియా, తక్కువ సంఖ్యలోనే టైఫాయిడ్, డయేరియా కేసులు ఉన్నాయి. ఎప్పటికప్పుడు సెన్సిటివ్ ఏరియాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వస్తున్నాం.

స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణపై ఎలా ఉంది?

ప్రతి మూడు నెలలకోసారి ఆయా డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు 168 స్కానింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఐదేళ్లకో సారి జిల్లాలోని రిజిస్టర్డ్ ఆస్పత్రులను రెన్యువల్ చేస్తున్నాం.

ప్రభుత్వ ఆస్పత్రుల తీరుతెన్నుల్ని వివరించండి?

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్నాయి. మూడు నెలలుగా రాష్ట్రస్థాయిలో ఒకటి, రెండు, మూడు ర్యాంకులతో మెరుగైన స్థానాల్లో నిలవడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లోనూ ఇదేఒరవడి కొనసాగించాలని పట్టుద లతో ఉన్నాం.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- కడప అర్బన్

కడపలోని ఎన్‌జిఒ భవనంలో ఎపిటిఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సును ఎపిజెఎసి జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు సులభంగా ఉత్తీర్ణత కావాలంటే శిక్షణ తరగతులలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగులకు వృత్తి నైపుణ్య సదస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు సి వి ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా ఎపిటిఎఫ్ చైతన్య సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. పరీక్షలు మెలకువల ఆధారంగా పరీక్ష రాయాలని కోరారు. పింఛన్ కోడ్, ట్రెజరీ కోడ్, భారత రాజ్యాంగంపై పట్టు సాధిస్తే 141 పేపర్ ఉత్తీర్ణత సులభతరం అవుతుందని తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్ మాట్లాడుతూ మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేసి ప్రశ్నాపత్ర స్వరూపాన్ని తెలుసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యం, వీరప్రసాద్, పద్మజ లతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిజెఎసి జిల్లా చైర్మన్ శ్రీనివాసులు

నేటి నుంచి తేక్వాండో శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినులకు సోమవారం నుంచి 21 వరకు క్యాంపస్‌లో తేక్వాండోలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపల్, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం గంటన్నరపాటూ నిపుణులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. హాస్టల్స్ విద్యార్థినులు హాజరయ్యేలా చూడాలని అన్ని విభాగాల అధిపతులు, కో-ఆర్డినేటర్‌లకు ప్రిన్సిపల్ సూచించారు. కళాశాల విద్యార్థినిలకు మంచి ఫిట్‌నెస్ అలానే ఆత్మ రక్షణ నైపుణ్యాలను మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



గెలుపొందిన అభ్యర్థులతో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత ఉందని, అందుకే సాగునీటి ఎన్నికలు సజావుగా జరగకుండా చేశారని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టిసిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్ మాట్లాడుతూ రైతులు స్వేచ్ఛగా పాల్గొనేందుకు అవకాశం లేకుండా కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులచే నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా చేశారన్నారు. రైతుల్లో వ్యతిరేకత ఉందని గ్రహించి సర్టిఫికెట్ ఇవ్వకుండా చేశారన్నారు. పెద్దముడియం మండలంలో 16 మంది ఎన్నికలలో పోటీ చేస్తే 15 మంది గెలిచారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుందన్నారు. సజావుగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నీటి సంఘం ఎన్నికలు పూర్తి వ్యతిరేకమన్నారు. ముఖ్యమంత్రి కిందిస్థాయిలో కూటమి నాయకులు చేసే విషయాలను గమనించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, చిన్నముడియం కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, మహేశ్వరరెడ్డి, గుండ్లకుంట, మేడిదిన్నె, చదిపిరాలదిన్నె, ఉప్పలపాడు నీటి సంఘం ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత సంఘం నేత శివనారాయణ

చేనేతలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు రుణ సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివనారాయణ కోరారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం 1.50 సెంట్లు స్థలం కేటాయించిందన్నారు. ఇది ఏమాత్రం సరిపోదన్నారు. ముఖ్యంగా చేనేతలు మగ్గం ఏర్పాటు చేసుకోవడానికి 1.50 సెంట్లు స్థలం ఎటూ సరిపోలేదని వివరించారు. ఆ చిన్న స్థలంలో మగ్గం, కుటుంబం ఎలా జీవిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1లక్షా 80వేలు మాత్రమే ఇచ్చిందని, సరిపోక లబ్ధిదారులు అప్పుచేసి ఇంటిని నిర్మించుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనైనా చేనేతలకు కనీసం 3 సెంట్లు స్థలం కేటాయించాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు పల్లా లక్ష్మీనారాయణ, దాసు, రమణ పాల్గొన్నారు.



మాంసం విక్రయాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నాణ్యమైన మాంసాన్ని అమ్మాలి

- ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నాణ్యమైన మాంసాన్ని అమ్మాలని, ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని మటన్, చికెన్, చేపల దుకాణాలను ఆదివారం రాఘవేంద్ర, మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులచే పరీక్షించిన జీవాల మాంసాన్ని మాత్రమే అమ్మాలన్నారు. పలు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాదీనం చేసుకున్నామన్నారు. ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగుల అమ్మే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడమేకాక చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాఘవేంద్ర తెలిపారు.

బోధనేతర సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - నందలూరు

మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంక్షేమమే తమ ధ్యేయమని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు శివకాంత్, అధ్యక్షుడు మనోహర్ నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో గల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్జీవో హెూం నందు మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంఘం 6వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సమావేశానికి ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ హాజరయ్యి అప్కోస్ సిబ్బందికి మినిమం టైం స్కేల్, కాంట్రాక్టు బోధనేతర సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయమని కోరారు. ఇందుకు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శివకాంత్ స్పందించి గురుకుల రెగ్యులర్ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసును ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి 62 అమలయ్యేలా చూస్తామన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రామమోహన్, లక్ష్మీ శ్రీనివాస జ్యువెలర్స్ పులివెందుల వారి సౌజన్యంతో నాట్యాచర్యులు డాక్టర్ ఆర్.మానస నృత్య కళాకేంద్రం, ధర్మవరం వారి చిన్నారులచే నిర్వహించిన ప్రేక్షకులను అలరించాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి సుధాకర్, నృత్య శిక్షకురాలు డాక్టర్ ఆర్.మానస, మాస్టర్ చందు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

వరి ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే వరకూ

నిల్వ చేయడమే శ్రేయష్కరం


ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. వరి ధాన్యం ధరలు గతంలో కంటే చాలా అధ్వానంగా ఉన్నాయి. గత ఏడాది నూర్పిడి సమయానికి 8 బస్తాల (పుట్టి) ధర రూ.14 వేలకు పైగా ఉండేది. ప్రస్తుతం 8 బస్తాలు వరి ధాన్యం ధర రూ.12వేలు మాత్రమే. పాత వరి ధాన్యం (ఏడాది క్రితమివి) రూ.24 వేలకు పైగా ఉన్న ధరలు ఒక్కసారిగా రూ.20వేలకు పడిపోయింది. ప్రస్తుతం ధాన్యాన్ని అమ్మకాలు చేయాలనుకున్న రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కోనుగోలు చేసే ఏర్పాట్లు చేపట్టడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు ధాన్యాన్ని నిలువచేసే ఆలోచనలో ఉన్నారు. చాలామంది రైతులు ధాన్యాన్ని గోడౌన్‌లో నిలువ ఉంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చాపాడు వద్ద రైతులకు ప్రసన్న ఆంజనేయస్వామి గౌడౌన్, మైదుకూరు, దువ్వూరు వద్ద ఇతర గౌడౌన్‌లు అందుబాటులో ఉన్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి, నిల్వ ఉంచేందుకు అవకాశం ఉంది. గౌడౌన్‌లో వరి ధాన్యం నిలువ ఉంచడం వల్ల గిటుబాటు ధర వచ్చేవరకు నిలువ ఉంచుకోవచ్చు. అంతేకాకుండా రైతు లకు ధాన్యంపై బ్యాంక్ రుణ సౌకర్యం కూడా ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ధాన్యం అమ్మకాలకు ఆసక్తి తగ్గి, నిల్వకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.



చాపాడులో అందుబాటులో ఉన్న గౌడౌన్

ఎన్నికలను వైసిపి బహిష్కరించేలా చేస్తాం



నీటి సంఘం అధ్యక్షులను అభినందిస్తున్న బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రానున్న ఎన్నికలన్నీ వైసిపి బహిష్కరించేలా చేస్తామని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రానాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బి అథిథిగృహంలో ఆదివారం ఆయన టిడిపి నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అద్దంలో ముఖం చూసుకుంటే ముందుగా హత్య కాబడిన వైఎస్ వివేకానందరెడ్డి ఫొటో కనుబడుతుందని ఎద్దేవా చేశారు. విఆర్ఒలను రెవెన్యూ కార్యాలయంలో నిర్భంధించి నీటి సంఘాల ఎన్నికలను జరుపుకున్నారని ఆరోపించడం ఎంపీ అవినాష్‌రెడ్డికి తగదన్నారు. అవినాష్‌రెడ్డికి ధైర్యం ఉంటే వేముల పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా, తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లాలి కదా అని ప్రశ్నించారు. నీటి సంఘాల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో ఒక చిన్న సంఘటన అయినా ఏమైనా జరిగిందా అని ఎంపీని ప్రశ్నించారు. పులివెందులలోనే పోటీ పెట్టుకోలేనప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఎలా పోటీ పెడతామని ఎంపీ, జగన్‌రెడ్డి మాట్లాడుకుని ఎన్నికలను బాయికాట్ చేశారని విమర్శించారు. గతంలో వైసిపి పరిపాలనలో అన్నీ ఏకగ్రీవం చేసుకున్నారని చెప్పారు. అవినాష్‌రెడ్డి వల్లనే జగన్‌రెడ్డికి కుటుంబం దూరమైందని తెలిపారు. తర్వాత తల్లి, చెల్లి కూడా దూరమైందని అందరూ చర్చించుకుంటున్నారన్నారు. వైసిపి పాలనలో రైతులకు డ్రిప్ ఇవ్వకుండా వేధించారని రవి తెలిపారు. అనంతరం నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన వారని బిటెక్ రవి అభినందించారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, యువ నాయకుడు రజనీకాంత్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, వేమా కుమార్, మహమ్మద్, తెలంగాణ వలి, శేషారెడ్డి, భాస్కర్, మల్లంగి గోపాల్‌రెడ్డి, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

బహిష్కరించినా అభ్యర్థులను నిలుపుకోలేదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల తాలూకా వ్యాప్తంగా నీటి సంఘాల ఎన్నికలను తాము బహిష్కరించినా 22 మంది అభ్యర్థులను నిలబెట్టుకోలేని ధీనపరిస్థితి మీది.. అది విజయమా అని వేముల మండల వైసిసి నాయకులు సాంబశివారెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్ టిడిపిని ప్రశ్నించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పులివెందుల తాలూకా వ్యాప్తంగా 32 నీటి సంఘాల పరిధిలో 288 టీసీ మెంబర్స్‌కు ఎన్నికలు జరిగాయన్నారు. నియోజకవర్గంలో వైసిపి మద్దతుదారులకు ఒక్కరికి కూడా నో డ్యూస్ సర్టిఫికెట్స్ ఇవ్వని పరిస్థితుల్లో తాము ఈ ఎన్నికలను బహిష్కరించామన్నారు. వంద శాతం ఏకగ్రీవంగా చేసుకోవలసిన (వైసిపి ఎన్నికలను బాయ్‌కాట్ చేసిన సందర్భంగా) ఎన్నికల్లో కూడా 21 టీసీ మెంబర్స్ స్థానాలకు అభ్య ర్థులను నిలబెట్టుకోలేకపోయారని తెలిపారు. పోలీసు, రెవెన్యూ యం త్రాంగం అంతా ఉపయోగించి కూడా 21 టీసీ మెంబర్స్ స్థానాలకు అభ్య ర్థులను నిలబెట్టుకోలేకపోయావని బిటెక్ రవిని ఉద్దేశించి వారు పేర్కొన్నారు. నో డ్యూస్ ఇప్పించడానికి వేముల రెవెన్యూ కార్యాలయానికి వస్తున్న ఎంపీని పోలీసులకు పది సార్లు ఫోన్ చేసి ఆయనను వారిచే అరెస్టు ఎందుకు చేయించాల్సి వచ్చిందని ప్రశించారు. వివేకా హత్యను రాజకీయంగా వాడుకోకపోతే నీకు నీ పార్టీలో కూడా మునగడ లేదన్నారు. సమావేశంలో వేముల జడ్పిటిసి సభ్యులు బయపురెడ్డి, మార్కెట్ మాజీ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైసిపి నాయకులు సాంబశివారెడ్డి, రవికుమార్‌రెడ్డి, దశావత రామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామమునిరెడ్డి, ఓ రసూల్, శివశంకర్‌రెడ్డి, మాజీ సివిల్ సప్లయి డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ కిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిది : ఎస్‌పి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి -కడప అర్బన్

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగం చేసి ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎస్‌పి వి.విద్యా సాగర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్‌పి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. అయన సిద్ధాంతాలను పాటిస్తూ, సమాజానికి సేవ చేయాలని సంకల్పించాలని పేర్కొన్నారు. అయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వారిపైన ఉందని పేర్కొన్నారు. అమరజీవికి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాల పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య , ఆర్ఐలు ఆనంద్, శ్రీశైల రెడ్డి, వీరేష్, టైటస్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కడప : పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధాంతులను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌస్ పీర్, శ్యామలమ్మ, గంగయ్య, సంజయ్ కాంత, నాగరత్న గౌడ్, సిద్ధిఖీ, మోషే పాల్గొన్నారు. **వైసిపి ఆధ్వర్యంలో...** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు కారణమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. ప్రతి ఒక్కరూ పొట్టి శ్రీరాములు ఆశయాలను పూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. నగరంలోని గోకుల్ లాడ్జ్ వద్దగల పొట్టి శ్రీరాములు విగ్రహానికి, వైసిపి జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు యానాదయ్య, మాజీ చైర్మన్లు పులి సునీల్, కరీముల్లా, ఎస్‌సి సెల్ అధ్యక్షులు వినోద్, నాయకులు, కార్పొరేటర్లు బసవరాజు, కె.బాబు, షంషీర్, త్యాగరాజు,దాసరి శివ, రామచంద్రయ్య, గౌస్ చాక్లెట్, పవర్ ఆల్తాఫ్, ఆరిపుల్ల బాష, సాయి దత్త, అర్జున్, మహిళా నాయకురాలు టీ.పి. వెంకటసుబ్బమ్మ, మల్లిలు, సునీత, చైతన్య, వైఎస్ఆర్ సీపీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరు (చాపాడు) : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మైదుకూరు అమ్మవారిశాల నుండి మార్కెట్ సర్కిల్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సర్కిల్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు సూరిశెట్టి ప్రసాద్, సభ సెక్రటరీ డివి సునీల్, ట్రెజరర్ నరసింహులు, అవోపా అధ్యక్షులు దరిశా శ్రీనివాసులు, ఇమ్మిడిశెట్టి సతీష్, శ్రీధర్, ఆర్యవైశ్య సభ కమిటీ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. **చాపాడులో** నేటి తరానికి ఆదర్శప్రాయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

దువ్వూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం యూపీ స్కూల్ దగ్గర ఉన్న శ్రీరాములు విగ్రహానికి దువ్వూరు వాసవి క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు దేవతి ఉపేంద్ర మాట్లాడుతూ తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మహేంద్ర, దేవతి నాగేష్, దేవతి రాము, పేర్ల శేషయ్య, రాయ వరం చంద్రశేఖర్, బచ్చు నాగేశ్వరరావు, ఈపూరి శివయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

ఖాజీపేట : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని టిడిపి మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాముల యాదవ్, మైదుకూరు నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఎంతగానో పోరాటాలు సాగించిన గొప్ప మహనీయుడని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని వారు ఆకాంక్షించారు.

పులివెందుల రూరల్ : పట్ట ణంలోని పూల అంగళ్ల సర్కిల్ వద్ద ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం నిరాహర దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధింతి వేడు లకను ఘనంగా నిర్వహించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోమున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ డైర్మెన్ చిన్నప్ప, వైసిపి నాయకులు లింగాల రామలింగారెడ్డి(రాము), నాలుగవ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ ఉన్నారు.



అమరజీవికి నివాళులర్పిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, నాయకులు



విద్యార్థి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో 1982-83 పదవ తరగతి విద్యార్థులు పాఠశాలలోని సరస్వతి విగ్రహానికి మకర తోరణం బహుకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మాజీ ఎంపిపి, టిడిపి నాయకుడు ధనపాల జగన్ మాట్లాడుతూ తనవంతు పాఠశాలలోని సమస్యల సాధనకు, అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో క్రీడల అభివృద్ధికి, వసతుల కల్పనకు పాటుపడతానని తెలిపారు. పదవ తరగతి 2023-24లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, మెమొంటోలతో సత్కరించారు. బాలురు పాఠశాలలో మెదటి స్థానంలో నిలిచిన బ్రహ్మసాగర్‌కు రూ.3,116, రెండవ స్థానంలో నిలిచిన యోగేంద్ర కుమార్‌కు రూ.2,116 నగదు బహుమతి అందజేశారు. బాలికల పాఠశాలలో మెదటి స్థానంలో నిలిచిన ధనలక్ష్మికి రూ.3,116, రెండవ స్థానంలో నిలిచిన ప్రవల్లికకు రూ.2,116 అందజేశారు. ప్రతి సంవత్సరం పది పరీక్షలో ఉన్నతస్థాయిలో ఉత్తీర్ణులు అయ్యే విద్యార్థులకు బహుమతి, మెమొంటోలు ఇచ్చి సత్కరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ఈ పాఠశాల పూర్వ విద్యార్థి అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా ఉన్న శీలం రమేష్ (1991-92 బ్యాచ్) ప్రతి సంవత్సరం 3వ బహుమతి ఇస్తామని, పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు విరాళం ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోశెట్టి రామమోహన్, సూర్యనారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు రవి ప్రకాష్, షేక్ మహబూబ్ బాషా, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, విఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరాముడు, సుబ్బారావు, గుర్రం ఓబులేసు, సిందే రవి చంద్రరావు, నాగరత్నాలు, రఘు రామిరెడ్డి, వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపిజె నాయకులు

సుందర సమాజ నిర్మాణానికి ఎంపిజెలో చేరండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సుందర సమాజ నిర్మాణం కోసం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె)లో చేరండని నాయకులు కోరారు. ఎంపిజె ఎపి ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 31వతేదీ వరకు జాయిన్ ఎంపిజె ఉద్యమ పోస్టర్స్‌ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ రఫీ, కార్యదర్శి గౌస్మహిద్ధి, ఎస్పైఓ జాతీయ అధ్యక్షులు బ్రదర్ అబ్దుల్ హాఫీజ్, రాష్ట్ర కార్యదర్శి సలీం గోడపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపిజె ఆశయాలు, లక్ష్యాలు, భావాలకు దగ్గరగా ఉండే వ్యక్తులు శాంతి స్థాపన కోసం చేరవచ్చు అన్నారు. దేశంలోని వివిధ మతాల మధ్య సోదర భావం నెలకొల్పడం ఎంపిజె లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్రమి, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు ముత్యార్, ఖాజా, అల్లా బకాష్, ఆజం పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు నిండినా ఇంతవరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని సంక్షేమ బోర్డు పునరుద్ధరణకై ఐక్యంగా ఉద్యమిద్దామని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బి.కొత్తకోటలో భవన నిర్మాణ కార్మిక సంఘం తాపీ మేస్త్రీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాల్సింది పోయి, సంక్షేమ బోర్డు రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డిప్యూటీ సీఎం కోటి రూపాయలు బోర్డులో జమ చేస్తామని చెప్పిన హామీ ఆరు నెలలు కావస్తున్నా నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. పెండింగులో ఉన్న నిర్మాణ కార్మికుల క్లైములు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రి వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజనేయులు, ఆదినారాయణ, రమణ పాల్గొన్నారు.

ఎపి కోచ్, మేనేజర్‌గా గణేష్‌బాబు

నందలూరు : జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా కోచ్, మేనేజర్‌గా టంగుటూరు జడ్‌పిహైస్కూల్ పీడీ పోలంకి గణేష్‌బాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కమిషనర్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు నియమించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ (దేవాస్)లో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జాతీయ స్థాయిలో అండర్-14, అండర్-17 అండర్-19 విభాగంలో సాఫ్ట్ టెన్నిస్ క్రీడ నిర్వహించడం జరుగు తుందని అన్నారు. ఈ పోటీలకు పోలంకి గణేష్ బాబును కోచ్, మేనేజర్‌గా ఎంపిక చేయడం విశేషమని అన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


క్రికెట్ పోటీలు ప్రారంభించిన 'సుగవాసి'

రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని ఊటుకూరులో టిడిపి నాయకులు బాలసుబ్రమణ్యం గీతాంజలి ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీలను ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన బాలసుబ్రమణ్యంను గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మదర్‌థెరిస్సా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున నిరాశ్రయులు, యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్, ముద్దనూరు రోడ్డు, దర్గా ఆవరణ, బస్టాండ్ ప్రాంతంలో నిద్రిస్తున్న 30 మందికి దుప్పట్లు అందజేసినట్లు ట్రస్టు చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం చలికాలంలో ఇలా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ట్రస్టు సభ్యులు విల్సన్, సునీల్, చరణ్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు